



# భయం

— డి. వర్ధని

శీలవతి తెల్లవారు ఝామున ఇంటికి వచ్చి వీధి తలుపు తాళం తీసింది. లోపలికి వెళ్ళి చప్పుడు కాకుండా తిరిగి తలుపు గడియ వేసేసింది. భయం భయంగా పిల్లల వేపు చూసింది. గాఢ నిద్రలో మునిగి వున్నారు. గుండెల మీద చెయ్యి వుంచుకుని 'హమ్మయ్య' అనుకుంది. గట్టిగా ఊపిరి పీల్చుకుంది. జడలో పెట్టుకున్న మల్లెల దండ తీసేసి, మూలకు విసిరేసింది.

పెరటిలోకి వెళ్ళి, బావి దగ్గర తలారా స్నానం చేసింది. మలినమైన తన శరీరాన్ని కడిగేసుకుంది. సాదా నేత చీర కట్టుకుని వచ్చింది. కూతురి వొళ్ళు నిమిరి, చెదిరిపోయిన దుప్పటి నిండుగా కప్పింది. వెళ్ళి తన మంచం మీద కూర్చుని పసివాణ్ణి ముద్దు పెట్టుకుంది.

పరుపు కింద పెట్టిన వంద రూపాయిల నోటు తీసి, ఆశగా ఈర్ష్యగా దాని వేపు చూసింది. 'ఈ రోజు ఫలితం యిది' అనుకుంది. అలా అనుకోగానే ఆమెకి ఎక్కడలేని దుఃఖం ముంచుకు వచ్చింది. చిన్నప్పుడు ఏడిస్తే అమ్మా నాన్నా ఓదార్చి, కావాలన్నవి కొని యిచ్చేవాళ్ళు. ఇప్పుడెవరు ఓదారుస్తారు? పిల్లలు చూస్తే భయ పడతారు. 'నా ఏడుపుకి బలం లేదు. అసహాయు రాలి అసహ్యకరమైన ఏడుపు! భగవంతుడికి కూడా నా మీద జాలి లేదు. నా కర్మ యిలా వుంది. ప్రపంచంలో ఈ కర్మ సిద్ధాంతాన్ని ఎవడు కనిపెట్టాడో కానీ, అది నాలాంటి వాళ్ళకి పెన్నిధిలాంటిది. లేకపోతే మనుగడే లేదు.' కళ్ళు తుడుచుకుని, ఒక్క గాఢమైన నిట్టూర్పు విడి చింది. పసివాడి పక్కనే మేను వాల్చింది. వొంట్లో ఎక్కడలేని నీరసం ముంచుకు వచ్చింది. నరాలు బిగుసుకు పోతున్నట్టు, తను చచ్చి పోతున్నట్టు అనిపించింది. భయంతో పసివాణ్ణి కౌగలించుకుంది. చచ్చిపోవాలన్న ఆలోచన అది వరకు శీలవతికి రెండు సార్లు వచ్చింది. అప్పుడు ఆమె భయపడలేదు. ఇప్పుడు చచ్చి పోతానేమో అని భయపడ సాగింది. ఏమంటే పిల్లలు పెద్ద

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్

2-8-91 ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

వాళ్ళయ్యేంత వరకూ బతకాలని ఆశగా వుంది. వాళ్ళకి ఏదో దారి చూపిస్తే తన బాధ్యత తీరిపోతుందని అనుకుంటోంది. ఆమెకా కష్ట పరంపరలు ఎందుకు కలిగాయో జీవితాన్ని పర్యావలోకనం చేసుకుంది.

శీలవతికి అత్త మామలు లేరు. పెళ్ళయిన కొత్తలో భర్తవైపు బంధువులింట్లో వుండేవాళ్ళు. రోజులు ఆనందంగా గడిచిపోయేవి. భర్త భూషణం యేమీ చేతకాని వాడనీ, అసమర్థుడనీ, కొంచెం వెర్రిబాగుల వాడనీ తెలిసిపోయింది. అతనికి విచక్షణా జ్ఞానం బొత్తిగా శూన్యం. ప్రస్తుతం ఆమె బతుకు కుక్కలు చింపిన విస్తరిలా కావడానికి ఆ భర్తే కారకుడు.

కొంత కాలం అక్కడ రోజులు గడిచిపోయినా, భర్త వైపు బంధువులు సూటీపోటీ మాటలు అనసాగేరు. శీలవతికి చాలా బాధనిపించింది. ఉద్యోగ ప్రయత్నం చెయ్యమని భర్తని పోరసాగింది. ప్రయత్నించగా భూషణానికి పట్నంలో ఒక కంపెనీ మేనేజరు దగ్గర కారు డ్రైవరుగా పని దొరికింది. తిండికి గుడ్డకి లోటు లేకుండా గడిచి పోతూండేది. సంక్రాంతికీ సంవత్సరాదికీ యజమాని నెల జీతం బోనస్‌గా ఇస్తూండే వాడు. ఆయన భార్య పేరుకి తగ్గట్టు కరుణామయి. మాసి చూడక ఏవేవో శీలవతికీ, పిల్లలకూ పంపించేది. ఆమె ఎక్కడికి వెళ్ళినా శీలవతిని తన కార్లో వెంట తీసికెళ్ళేది. శీలవతి ఎంతో అదృష్టవంతురాలన్నారు. కాని ఆమె భర్త అతి తెలివి తక్కువ పని చేసేడు. వెర్రి వాడిలా ప్రవర్తించేడు. అమ్మగారి దగ్గర అతి చనువువల్ల అలా జరిగింది.

మేనేజరు దంపతులు, వాళ్ళ మామిడి తోట కాపు పట్టే సమయంలో చూడ్డానికి వెళ్ళేరు. వాళ్ళు తోటలో తిరుగుతూంటే ఆమె భుజం మీద కాకి రెట్ట వేసింది. అది భూషణం కంట పడుతూనే గబుక్కున కొంగు పట్టుకున్నాడు. రుమాలుతో తుడవ బోయేడు. పాలిస్టర్ చీర కావడంవల్ల పైట ఊడిపోయింది. ఆమె 'యూ స్కౌండ్రల్' అంటూ భూషణాన్ని ఒక్క లెంపకాయ కొట్టింది. ఒళ్ళు తెలీకుండా తిట్టేసింది. ఆ తర్వాత మేనేజరు అతన్ని పనిలోంచి తొలగించేడు. ఎంత చనువు వున్నా అలా పైట పట్టుకోడం ఎంత తప్పో అతనికి తెలీలేదు. తప్పు తెలుసుకుని క్షమాపణ చెప్పుకున్నాడు. అయినా లాభం లేకపోయింది. దురదృష్టం అతనిది కాదు భూషణం భార్యా బిడ్డలది.

తర్వాత భూషణం దురదృష్టం ఏమిటో కాని ఎక్కడికి వెళ్ళినా 'నువ్వేం పని చెయ్యగలవు? వెళ్ళు వెళ్ళు' అన్నారు. ఎంతో ప్రయత్నం మీద ఒక సినిమా హాల్లో స్త్రీల గేటు వద్ద టిక్కెట్లు చింపే ఉద్యోగం దొరికింది. అది కూడా ఎన్నాళ్ళో నిలబడలేదు. ఏమంటే పాత విషయం అల్లి బిల్లిగా అల్లుకు పోడంవల్ల సినిమా మేనేజరు కొత్తవాణ్ణి వేసేసుకున్నాడు. బుట్టలో పువ్వుల దండలు వేసుకుని, వీధి వీధి తిరిగి అమ్మేడు. తన దగ్గర ఎవ్వరూ కొనలేదంటూ ఆ పని కూడా మానేశాడు. స్త్రీల పాటలు 'కుశలాయకం, లక్ష్మణ దేవర నవ్వు' మొదలైన పుస్తకాలు ఇంటింటికీ తిరిగి అద్దెలకిచ్చేవాడు. ఈ రోజుల్లో అలాంటి పుస్తకాలు ఎవరు చదువుతారు? రాబడి లేదంటూ వదలి పెట్టేసేడు. శీలవతి మెళ్ళోని మంగళ సూత్రం అమ్మేసి ఆ డబ్బుతో దీపావళి సామాన్లు కొని అమ్మేడు. భూషణానికి బాగా నష్టం వచ్చింది. ఏమైందని భార్య అడిగితే ఈ సంవత్సరం చాలా మంది లైసెన్సు తెచ్చుకుని, మందులు అమ్మేరు. ఆ కారణం వల్ల అమ్మకం సరిగ్గా జరగ లేదు."అడిగిన వాళ్ళందరికీ లైసెన్సు యిచ్చేస్తే ఏమౌతుంది?" అంటూ ప్రభుత్వాన్ని తిట్టిపోసేడు. అంతే కానీ తన చేతకాని తనానికి సిగ్గుపడలేదు.

"పోనీ పాల కేంద్రం పెడదాం. ఆడవాళ్ళ పేరుతో పెడితే మంజూరు చేస్తారు. కొంత డబ్బు డిపాజిట్ కట్టాలి ఏమంటావు?" అన్నాడు మర్నాడు.

"నీకు ఏదీ కుదురుగా చేసుకోడం తెలీదు. ఏ పనీ చేతకాదు. ఉత్త బండవి. కొండల్లో వుండవలసిన వాడివి. నా మెళ్ళో తాళి కట్టి నా కొంప ముంచేవు. డిపాజిట్ కట్టడానికి డబ్బు ఎక్కడ తెస్తాము? అప్పు తెస్తే మళ్ళీ తీర్చేదెలా?" అంటూ చెడా మడా తిట్టేసింది.

అసమర్థుడైన భూషణానికి పౌరుషం మాత్రం చాలా అధికం. ఆ పూట భోజనం మానేసేడు. ఇంట్లోంచి వెళ్ళిపోయేడు రెండు రోజులు గడిచిపోయేయి. శీలవతి రోజూ భర్త రాక కోసం ఎదురు చూస్తూనే వుంది. పది రోజులు దాటినా అతని జాడ కనిపించలేదు.

హోటల్ మయూరిలో భోజనం చేస్తూంటే చూసేమనీ , రెస్టారెంటులో రొట్టెలు తింటూంటే చూసేమనీ, బడ్డీ కొట్టు దగ్గర టీ తాగుతూంటే చూసేమనీ, ఆ వీధి వాళ్ళు వార్తలు తెస్తున్నారు. వాళ్ళు చెప్పిన చోటల్లా వెతికింది. అయినా లాభం లేకపోయింది. భర్త ఇల్లుదాటి వెళ్ళి నెలయింది. ఒక రోజు ఉదయాన్నే హఠాత్తుగా భూషణం ఇంటికి వచ్చేడు. అతన్ని చూడగానే శీలవతికి మళ్ళీ పాత విషయాలు గుర్తు వచ్చేయి. కోపంతో భర్త మీద మండిపడింది.

"నీకు సిగ్గు లేదూ? ఇన్నాళ్ళూ పెళ్ళాం పిల్లలూ తిన్నారో లేదో అక్కర్లేక పోయింది. ఏమయ్యేరో అన్న బాధ లేదు. హోటల్లో పడి తినేసి ఊరు కొలుస్తున్నావా? చేతిలో డబ్బులు అయిపోగానే ఇల్లు కనిపించిందా? ఇలాంటి వాడివి పెళ్ళెందుకు చేసుకున్నావు? ఈ పిల్లల్ని ఏం

---

భయం క్రిమి మనిషిలో ప్రవేశించి తొలిచేయడం ప్రారంభించిందా_మనిషి మనిషిగా మిగలరు. అన్ని విలువల మీదా, ఆఖరికి మానవత్వం మీదా నమ్మకం పోగొట్టుకున్న డొల్లగా మారిపోతారు. మనిషిలో భయం ప్రవేశించడానికి మనుషులే కారణం. ఆ భయం నిర్హేతుకమైనదనీ, మనిషి మీద నమ్మకముంచుకోవచ్చుననీ తెలియజెప్పేదీ మళ్ళీ మనుషులే!

మనుషుల మీద నమ్మకం పూర్తిగా కోల్పోవడానికి అనేక భయంకరానుభవాల నేపథ్యం వుండవచ్చు. అయితే, నమ్మకం కలగడానికి ఓ చిన్న సందర్భం చాలు. అంటే, మనిషి సహజంగా మనుషులను నమ్మాలనే అనుకుంటారన్న మాట!

వేద్దామనుకున్నావు? అబద్ధం చెప్పకు. హోటళ్ళల్లో పడి తిన్నావా? లేదా? చెప్పు?'' అంటూ ఏడ్చింది. అయినా భూషణం మౌనంగా కూర్చున్నాడు.

మళ్ళీ శీలవతే అంది.

''మా నాన్న దాచుకోమని, ఎప్పుడో యిచ్చిన వెండి రూపాయిలను పట్టుకెళ్ళి అమ్మేసేను. ఆ డబ్బుతో పిల్లలకు ఇంత అన్నం వండి పెడు తున్నాను. ఇన్నాళ్ళకు వచ్చేరో లేదో చూడ్డానికి వచ్చేవా? నువ్వు మనిషివా, పశువ్వా!' మరో మారు మండి పడింది.

భూషణం మౌనంగా ఏడు గంటల వరకు కూర్చున్నాడు. ఇంకా పిల్లలు నిద్ర లేవలేదు. నెమ్మదిగా వంట ఇంట్లోకి వెళ్ళేడు. వాళ్ళ కోసం వుంచిన 'టీ' ఒక గ్లాసులోకి ఒంపుకున్నాడు. మరో యింత పంచదార కలిపేడు. రెండు చేతులతోను గ్లాసు పట్టుకుని పసివాళ్ళు తేనె చప్పరించినట్టు లొట్టలు వేసుకుంటూ త్రాగే సేడు. బల్ల మీద పడేసిన తువ్వాలు తీసి, ఒక్క దులుపు దులిపేడు. పై మీద వేసుకున్నాడు. భార్య ముఖంలోకి తీక్షణంగా చూసేడు. వీధి గుమ్మం వైపు నడిచాడు."మళ్ళీ ఎప్పుడు వస్తావు?'' అని అడుగుతున్న శీలవతి మాట వినిపించు కోకుండా వెళ్ళిపోయేడు. మళ్ళీ ఆ ఊళ్ళో కని పించలేదు.

శీలవతి ఒకరింట్లో పాచిపని మొదలు పెట్టింది. రెండు నెలలు గడిచాయి. ఉదయం పనంతా పూర్తిచేసి ఇంటికి వచ్చేసింది. సాయంత్రం పనిలోకి వెళ్ళాలనుకుంటూంటే యజమాని ఇంట్లో నౌకరుపోలీసుల్ని వెంట బెట్టు కుని వచ్చేడు. వాళ్ళు శీలవతి ఇల్లంతా వెతక సాగారు. ఏమైందని అడిగింది శీలవతి.

''బాబుగారిది చాలా ఖరీదుగల వాచీ పోయిందిట. నీ మీద పోలీసులకు రిపోర్టు యిచ్చేరు నీ ఇల్లు సోదా చేస్తున్నారు'' అన్నాడు నౌకరు.

''నాకు తెలీదు రాముా''

''పెద్ద వాళ్ళ వ్యవహారాలు యిలాగే వుంటాయి. మనం పేదవాళ్ళం''

ఇంతలో పోలీసులు శీలవతి దగ్గరకు వచ్చి ''నీ ఇల్లు సోదా చేసేం. దొరకలేదు. పద బాబుగారి దగ్గరకు'' అంటూ లాక్కుపోయేరు.

''ఉదయం గదులు ఊడ్చేటప్పుడు ఇదే కాజేసి వుంటుంది. మరెవ్వరూ ఆ గదిలోకి వెళ్ళలేదు. ఎక్కడ దాచిందో చెప్పే వరకూ తన్నండి'' అంటూ యజమాని భార్య గద్దించింది.

''నా పిల్లల తోడు నేను తియ్యలేదమ్మా'' అంటూ కాళ్ళు పట్టుకోబోయింది.

''దీని మీదే మాకు అనుమానం. ఏం చేసిందో చెప్పే వరకు స్టేషన్‌లో బంధించండి'' అన్నాడు పెద్ద పలుకుబడి వున్న ఇంటి యజ మాని.

పోలీసులు శీలవతిని స్టేషన్‌కి బదులు ఒక లాడ్జింగ్ హౌస్‌కి లాక్కుపోయారు. చీకటిగా వున్న ఒక గదిలోకి నెట్టి, తలుపు మూయ బోతున్న సమయంలో వదిలేయమని శీలవతి ఎంతో ఏడ్చింది. పెనుగులాడింది. లాభం లేకపోయింది. తలుపు బైట తాళం పెట్టేసారు.

శీలవతి తలుపు దగ్గరే కుప్పలా కూర్చుండి పోయింది. టైము ఎంత అయిందో తెలీదు. తలుపు తెరుస్తున్న చప్పుడికి గబుక్కున లేచి నుంచుంది. ఒక మనిషి లోపలికి వచ్చేడు. తిరిగి తలుపు మూసేశాడు. చీకటిగా వుండడంవల్ల ఆ వచ్చిన వ్యక్తి ఎవరైందీ శీలవతి పోల్చలేక పోయింది. దగ్గరగా వచ్చి ఒంటి మీద చెయ్యి వేసేడు. భయంతో శరీరం వణక సాగింది. కౌగలించు కున్నాడు. ఆ ... యింది. నోరు నొక్కేసేడు. ఆమె పరువు చీకట్లోకి జారిపోయింది.

సూర్యోదయమైంది. శీలవతిని విడిచి పెట్టే సేరు. ఆమె శరీరం కసితో దహించుకు పోతోంది. ఇంటికి వచ్చింది బావిలో నీళ్ళు తోడుకుని గబగబ తల మీద దిమ్మరించుకుంది. పొడి చీర కట్టుకుని వచ్చి పిల్లల్ని కౌగలించుకుంది. లోపలున్న కసినంతా కన్నీళ్ళ రూపంలో ఒలక బోసింది.

అప్పుడు మొట్ట మొదట చచ్చిపోవాలను కుంది. చావంటే భయపడలేదు. కానీ పిల్లల్ని దిక్కులేని వాళ్ళని చెయ్యలేక పోయింది.

ఎంత ప్రయత్నించినా కూలి పని దొరక లేదు. రైల్వే స్టేషన్ దగ్గర,బస్సు స్టాండ్‌లోనూ అడుక్కోడం మొదలు పెట్టింది. ఆమె వేపు చూసి కన్ను కొట్టే కొందరు, వెకిలి నవ్వులు నవ్వే వాళ్ళు మరి కొందరు కావాలని చెయ్యి తాకి పది పైసలు వేసేవాళ్ళు ఇంకొందరు. శీలవతి అందం అందర్నీ ఆకర్షించేంది. ఇంటికి వచ్చినాకీ అందం ఎందుకు యిచ్చేవు భగవంతుడా?' అని కుమిలి పోయేది.

ఇలాంటి అవమానాలు భరిస్తూ రోజంతా తిరిగితే రెండు మూడు రూపాయిలు దొరకడం కష్టమయ్యేది. అలా ఎంత కాలం బతగ్గలదు? పిల్లల్ని ఎలా పోషించ గలదు? భయంకరమైన నిస్సహాయత ఆమెను చుట్టుముట్టింది. అప్పుడు రెండవ మారు పిల్లల్ని చంపి తానూ చచ్చిపోదా మనుకుంది. అప్పుడు కూడా చావంటే భయపడ లేదు. తన ఖర్మానికి ఆ పసివాళ్ళని చేతులారా చంపడం మహా పాపం అనుకుని ఆ ప్రయత్నం విరమించుకుంది.

రెండు రోజుల్నుంచి పట్టుకున్న ముసురు తగ్గలేదు. ఆ దొరికే రెండు మూడు రూపాయిలు కూడా దొరక లేదు. ఇరుగు పొరుగమ్మలు, రెండు పూటలు పిల్లలకు ఇంత అన్నం పెట్టేరు. మూడో రోజు ఎలాగో ఇన్ని టీ నీళ్ళు తెచ్చి పిల్లలకు పట్టింది. అయినా అన్నం కోసం ఏడ్చి ఏడ్చి పిల్లలు సొమ్మసిల్లి పడుకున్నారు. తాను తన పిల్లలు బ్రతికే మార్గం చూడాలి ఏదో ఒకటి చెయ్యక తప్పదు. పిల్లల్ని పోషించ డానికి ఎలాంటి పని చేసినా తప్పలేదు. కన్నతల్లి పిల్లల్ని చంపుకో లేదు. ఏపనికైనా సిద్ధపడాలి. అని తీర్మానించు కుంది.

అర్ధరాత్రి వీధి తలుపు తెరిచింది. ఉరుములూ మెరుపులూ ప్రకృతి బీభత్సంగా వుంది. తన స్వభావానికి విరుద్ధమైన పని చెయ్యవలసి వస్తోం దని భయపడిందే కాని ప్రకృతికి భయపడలేదు. బైట తలుపు గొళ్ళెం పెట్టేసింది. బ్రోకరు వీరయ్య దగ్గరకు వెళ్ళింది తెల్లవారే సరికి వీరయ్య కమిషన్ పోను, ఇరవై రూపాయిలు చేతికందేయి. ఇరవై వేల రూపాయల్లా కళ్ళకద్దుకుంది.

పిల్లలకు ఇంత వండిపెట్టి, తానూ తిన్నది. ఆకలి చల్లారి పది రోజులు గడిచే సరికి ఆ తెచ్చే డబ్బు అతి స్వల్పం అనిపించింది. అవసరాలు పెరిగేయి. గుడిసెలోంచి పెంకుటింట్లోకి మారి పోయింది. స్వంతంగా వ్యాపారం మొదలు పెట్టింది. వీధిలో ఎవరి కంటా పడకుండా అర్ధ రాత్రి వీధి తలుపు తాళం పెట్టి వెళ్ళడం, తెల్లవారు ఝామునే రావడం, ఇదీ ఆమె కార్య క్రమం.

పది సంవత్సరాలు గడిచిపోయేయి. శీలవతికి అందం తగ్గిపోయింది. రక్త మాంసాలన్నీ హరించి పోసాగేయి. మంచంలోంచి లేవలేని పరిస్థితి ఏర్ప డింది. ఇంట్లో సామాన్లన్నీ ఒక్కొక్కటే అమ్ము కుని తింటోంది. అలా కొన్నాళ్ళు గడిచి

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్

పోయాయి. అంత దరిద్రంలోనూ కూతురు పుష్ప శరీరంలోకి యవ్వనం విచిత్రంగా ప్రవేశించింది.

పుష్ప తొమ్మిదవ తరగతి పాసయి పదవ తరగతిలోకి వచ్చింది. తనకు ఏమాత్రం చదువు లేకపోవడం వల్లే అలాంటి గతి పట్టిందనీ, కూతురు పదవ తరగతి పాసవుతే ఎక్కడేనా ఉద్యోగం దొరుకుతుందనీ, ఆమె కష్టాలు గట్టెక్కుతాయనీ, శీలవతి ఆశపడింది.

కానీ స్కూళ్ళు తెరిచినా పుష్పని స్కూల్లో చేర్పించలేక పోయింది. జీతాలు పుస్తకాలే కాకుండా ఇంకా ఎన్నో అవసరాలు వుంటాయి. భోజనానికే కష్టంగా వుంది. డబ్బు ఎక్కడి నుంచి తెచ్చేది. మంచంలోంచి లేచే ఓపిక లేదు. ఎలా? ఎలా? శీలవతి తన కష్టాలు తలుచుకుని కుమిలిపోయింది.

ఆ రోజు పుష్ప తన స్నేహితురాల్ని అడిగి తెచ్చుకున్న ఏదో పుస్తకం చదువుతూ కూర్చుంది. ఆదివారం కావడం వల్ల పుష్ప తమ్ముడు గోవిందు వీథిలో పిల్లలతో ఆడుకోడానికి వెళ్ళేడు.

"అస్తమానం ఆ పాడు పుస్తకాలు చదవకపోతే తమ్ముడికి నాలుగు ముక్కలు చెప్పరాదుటే? నెల రోజులైంది చూస్తున్నాను. రోజూ ఓ పుస్తకం తేవడం చదువుతూ కూర్చోడం! నీ తీరు నాకేం నచ్చలేదు. పది పాసవుతే నీకు ఎక్కడేనా ఉద్యోగం దొరుకుతుందనీ, తమ్ముడికీ, ఈ ఇంటికీ కాస్త ఆసరా వుంటావని, ఎంతో ఆశ పడ్డాను. కాని ఆ భగవంతుడికి నా మీద దయ లేదు. నన్ను మంచంలో పడేసేడు" అంటూ వొంట్లో ఓపిక లేక పోయినా శీలవతి కూతుర్ని కోపగించింది.

"నే చెపితే వాడు వినడం లేదు. హోమ్ వర్కు చెయ్యరా అంటే ఆడుకుందికి పోయేడు నేనేం చేసేది" అనేసి పుష్ప మళ్ళీ పుస్తకంలో తల దూర్చి చదుకుంటూ కూర్చుంది.

ఐదు గంటల కల్లా గోవిందు ఆట చాలించి ఇంట్లోకి వచ్చేడు.

"అక్కా ఆకలవుతోంది తినడానికి ఏమేనా పెట్టు" అంటూ మారాం చేసేడు.

"ఇంట్లో ఏమీ లేదు ఏం పెట్టేది?" అని విసుక్కుంది. చదవడం పూర్తి చేసిన పుస్తకం పట్టుకుని పెరటిలో మందడి గోడ పడిపోవడం వల్ల అది దాటి పక్క యింట్లో వున్న స్నేహితురాలింటికి వెళ్ళింది.

పుష్ప రాక కోసమే ఎదురు చూస్తున్నట్టు స్నేహితురాలి అన్న గది గుమ్మంలోనే ఎదురయ్యేడు. అతణ్ణి చూసి పుష్ప గుమ్మం దగ్గరే ఆగిపోయింది.

"లక్ష్మి లేదండీ?" వీణ మీటినట్లుంది గొంతు.

"లక్ష్మి, అమ్మా కలిసి దేవాలయా... వెళ్ళేరు లోపలికి రా పుష్పా ఏం కావాలి?" అడిగాడు రెండు అడుగులు వెనక్కి జరిగి.

"ఈ పుస్తకం చదవడం అయిపోయింది. లక్ష్మి వస్తే యిచ్చేయండి" అంటూ గదిలోకి వెళ్ళి బల్ల మీద పెట్టింది.

"ఈ పుస్తకం ఎలా వుంది?" ఆ పుస్తకం చేత్తో పట్టుకుని పేజీలు తిరగవేస్తూ నవ్వుతూ అడిగేడు.

"బాగానే వుంది"

"బాగానే వుందా? బాగుందా? ఇంకా ఇలాంటి పుస్తకాలే లైబ్రరీ నుంచి తెచ్చేదా?" పుష్ప కళ్ళల్లోకి చూసేడు.

పుష్పకి ఎక్కడ లేని సిగ్గు ముంచుకు వచ్చింది. తల దించుకుని -

"నే వెళ్ళాలి తమ్ముడు ఆకలవుతూందని మారాం చేస్తున్నాడు. టిఫెన్ చేసి పెట్టాలి" కదల బోయింది పుష్ప.

"ఆగు మర్చి పోయేను. మా లక్ష్మి నువ్వు వస్తే ఈ మిఠాయి నీ కిమ్మని చెప్పింది" వంట గదిలోకి వెళ్ళి ఓ పెకెట్ తెచ్చి పుష్పకి అందించేడు. కావాలని చెయ్యి తాకేడు. ఆ స్పర్శకి పుష్ప శరీరంలో విద్యుత్ ప్రవేశించినట్లయింది. దాంతో మైకం కమ్మింది. మైకం వదిలి కళ్ళు తెరిచి చూసే సరికి అతని పెదవులు పుష్ప పెదవుల్ని నొక్కుతున్నాయి. బాహువుల్లో బంధింప బడి వుంది. విడిపించుకుందికి ప్రయత్నించింది. చెవి దగ్గర గుస గుసగా అన్నాడు. "రాత్రి పెరటిలోకి రా, నీతో మాట్లాడాలి" అంటూ వదిలి పెట్టేసాడు. ఒక్క ఉదుటున ఇంట్లోకి పరుగెత్తుకొచ్చేసింది. కొత్త అనుభవంతో శరీరం పులకిస్తూంటే మౌనంగా కూర్చుంది.

శీలవతి అచేతనంగా కూర్చున్న కూతుర్ని పక్కనే వున్న పేకెట్‌ని చూసింది.

"ఏమైందే? అలా కూర్చున్నావు? ఆ పేకెట్టు ఏమిటి?" పుష్పకి చైతన్యం వచ్చింది.

"మా స్నేహితురాలు లక్ష్మి యిచ్చిందమ్మా మిఠాయి"

"వాళ్ళింట్లో ఈ రోజు ఏమేనా పండుగా?"

"ఆ! వాళ్ళ అన్నయ్య పుట్టిన రోజు పండుగ."

"పాపం తమ్ముడికి పెట్టు. వెర్రి వెధవ ఆకలవుతూందని ఇంత సేపూ గొడవ పెట్టేడు. నేను మంచమెక్కింది మొదలు వాడికేం చేసి పెట్టనే లేదు."

రాత్రి పుష్ప తమ్ముడుకి, తల్లికి భోజ... పెట్టేసింది. తానూ తినేసి మళ్ళీ పుస్తకం చదువుతూ కూర్చుంది. పది గంటలయ్యే సరికి గోవిందు చదువుకుంటున్న వాడల్లా అలాగే నిద్రలోకి జారిపోయేడు. వాణ్ణి లేపి మంచం మీద పడుకో బెట్టింది. తల్లి వేపు చూసింది. ఆమె కూడా మంచి నిద్రలో వున్నట్టు తెలుసుకుంది. లైటు తీసేసింది. తన మంచం మీద కూర్చుంది. కొత్త అనుభూతి కోసం శరీరం ప్రేరేపిస్తున్నా మనస్సు అంగీకరించడం లేదు. ఆ సంఘర్షణలో ఎక్కడో పదకొండు గంటలు కొట్టడం వినిపించింది. పుష్ప మంచం దిగింది. పెరటి తలుపు నెమ్మదిగా తెరిచింది. నూతి పళ్ళెం దగ్గర మధుమూర్తి తచ్చాడుతున్నాడు.

రోజులు జరిగిపోతున్నాయి. పుష్ప రెండు పూటలా కూరతో భోజనం అమరుస్తోంది. తల్లికి కావలసిన మందులు కూడా కొంటూంది.

"ఇవన్నీ ఎలా కొంటున్నావే? డబ్బు ఎక్కడిది?" కూతురి వేపు అనుమానంగా చూస్తూ ప్రశ్నించింది.

"నా స్నేహితురాలు లక్ష్మి జాలిపడి, డబ్బు ఇచ్చిందమ్మా. తమ్ముడికి కావలసిన పుస్తకాలు కూడా కొంటాను. పుస్తకాలు కొనలేదని నిన్న తమ్ముణ్ణి వాళ్ళ టీచరు ఎండలో నిలబెట్టిందట."

"సరేలే నా వొంట్లో బాగున్నాక అప్పు తీర్చేద్దాంలే. దిక్కులేని వాళ్ళకి దేవుడే ఏదో దారి చూపిస్తాడు" అందామె సంతోషంగా. అనుమానం నివృత్తి కావడంతో ఆమె మనస్సు తేలిక పడింది.

వేళకి సరైన భోజనం, మందులు, అమరడంతో శీలవతికి వొంట్లో కాస్త ఓపిక వస్తోంది. లేచి అటూ ఇటూ తిరుగుతూంది.

మూడు నెలలు దాటేయి. ఒక రోజు శీలవతికి చీకటితోనే మెలుకువ వచ్చింది. పిల్లల వేపు చూసింది. పుష్ప మంచం మీద లేదు. గదంతా కలియ చూసింది. కనిపించక పోయేసరికి "పుష్పా! పుష్పా" అని రెండు మార్లు పిలిచింది. పలకలేదు. నెమ్మదిగా లేచి వంట ఇంట్లో కెళ్ళింది. అక్కడా లేదు. 'ఇంత ఉదయాన్నే ఎక్కడికి వెళ్ళిందబ్బా' అనుకుంటూ పెరటి తలుపు చూసింది. గడియ తీసేసి వుంది. తలుపులు తెరచి పెరటిలోకి వెళ్ళింది. నూతి పళ్ళెం దగ్గరే వున్న వేప చెట్టు మీద కాకులు కావు కావు మంటున్నాయి. చెట్టు మొదట్లో పుష్ప కూర్చుని వుంది. రెండు చేతులూ నెత్తి మీద పెట్టుకుని వాంతి చేసుకుంటోంది. ఆ దృశ్యం చూసి శీలవతి ఒక్క

క్షణం చలన రహితంగా వుండిపోయింది. తనలో గడ్డ కట్టుకు పోయిన భయం కరిగి ముంచెత్తు తున్నట్టుగా వుంది.

శీలవతి కుప్పలా కూలిపోయింది. కూతురు కూడా తనలాగే బతక పోతూందా? అనుకుంటే గుండె ఆగిపోతున్నట్టయింది.

శీలవతి కళ్ళు తెరిచే సరికి పుష్ప పక్కనే కూర్చుని వుంది. తల్లిని నెమ్మదిగా తీసుకు వచ్చి మంచం మీద పడుకో బెట్టింది. టీ తయారు చేసి తెచ్చి తాగించింది.

"ఏం జరిగిందమ్మా? అలా కళ్ళు తిరిగి పడిపోయావు? వంట్లో ఎలా వుంది?" పక్కనే కూర్చుని అడుగుతూంది పుష్ప.

"సూటిగా చెప్పు. నిన్ను మోసగించిం దెవరు?"

"మోస మేమిటి? నన్నెవరూ మోసగించ్ల లేదు."

"మరయితే వాంతు లెందుకవుతున్నాయి?" అప్పుడు పుష్పకి తల్లి బాధేమిటో అర్థం అయింది.

"నువ్వు ఊహించిందేమీ జరగలేదు. భయ పడకు! మధుమూర్తి నన్ను పెళ్ళి చేసుకుంటా నన్నాడు" తల్లికి పెళ్ళి విషయం ఎలా చెప్పాలా అని అనుకుంటున్న పుష్పకి అనుకోకుండా అవకాశం దొరికింది.

"ఎంత వెర్రి దానివే? వాళ్ళకూ మనకూ సంబంధమా? నిన్ను మధుమూర్తి చేసుకుంటా నన్నా వాళ్ళ వాళ్ళు ఒప్పుకుంటారా? అతని మాయ మాటలు నమ్మి, మోస పోయే వన్న మాట! నా మలినం నీకు అంట కూడదనీ, నువ్వు సుఖంగా వుంటే చూడాలనీ కలలు కన్నాను. నా గతే నీకూ పట్టిందన్న మాట!" అంటూ కుమిలి పోసాగింది.

పుష్ప అవాక్కయిపోయింది. నాలుగు రోజులు గడిచేయి. శీలవతి కోపంతో అసహ్యంతో పుష్పతో మాట్లాడ్డం మానేసింది. మాటల్తో తల్లిని సమాధాన పరచడం కష్టమని పుష్ప కూడా మాట్లాడలేదు. ఆ రోజు ఉదయం అనగా ఇంట్లోంచి వెళ్ళిన పుష్ప రాత్రి పది గంటలైనా ఇంటికి రాలేదు. శీలవతి ఆతృతగా ఎదురు చూడసాగింది. గోవిందుని మాటి మాటికీ వీధి చివర వరకు వెళ్ళి చూసి రమ్మని పంపుతూంది. ఇంక నే వెళ్ళను నిద్ర వస్తూంది' అంటూ పడుకున్నాడు వాడు.

ఇంతలో వీధి గుమ్మంలో రిక్షాలు ఆగిన శబ్దం వినిపించింది. తలుపు దగ్గర మంచుని ఎవరా అని చూసింది. పెళ్ళి కూతురు అలంకరణలో పుష్ప రిక్షా దిగింది. వెనుకనే పెళ్ళి కొడుకు అలం కరణలో వున్న మధుమూర్తి దిగేడు. వెనుక రిక్షాలోంచి మధుమూర్తి తల్లీ చెల్లెలు లక్ష్మీ దిగేరు. శీలవతి తన కళ్ళను తానే నమ్మలేక పోయింది.

"ఇప్పుడే అన్నవరం నుంచి వస్తున్నాం. మేమిద్దరం పెళ్ళి చేసుకున్నాం. మీతో చెప్పకుండా పెళ్ళికి ఒప్పుకోలేదు పుష్ప. చెప్పినా మీరు నమ్మక పోవచ్చనీ, పెళ్ళి చేసుకుని మిమ్మల్ని సంతోష పరుద్దామనీ చెప్పి వొప్పిం చాను. ఇలా చేసినందుకు క్షమించండి" అన్నాడు మధుమూర్తి శీలవతికి నమస్కరిస్తూ.

"దీవించండి వదినా! అలా ఆశ్చర్య పోతా రేమిటి?" అంది శీలవతిని కుదుపుతూ మధు మూర్తి తల్లి జానకమ్మ.

దాంతో శీలవతికి ఎక్కడ లేని దుఃఖం ముంచుకు వచ్చింది. కళ్ళల్లో నీళ్ళు ఉబికేయి. ఆ కన్నీటి తెరల మధ్యనే ఆమె వాళ్ళకేసి చూస్తోంది. జీవితం మీదా, మనుషుల మీదా నమ్మకం పోగొట్టుకున్నందుకు కలిగిన దుఃఖమో, నమ్మకం కలుగు తున్నందుకు వస్తున్న సంతోషమో తెలీదు అది!

●


ఈ డీలర్‌కి ఇంతటి ఆనందం ఎందుకు ?




ఈ పోటీ ప్రపంచంలో కొనుగోలుదారులు
ఖచ్చితమైన నాణ్యాన్ని ఎంచుకుంటారు -
ప్రతీ సిమెంట్ కూడా కట్టడానికి
అనుకూలంగానే తయారవుతోంది -
కానీ... 'కట్టడానికి' పటిష్టత చేకూర్చడంలో
సువర్ణ సిమెంట్‌దే ప్రప్రథమ స్థాయి -
అలాంటి నాణ్యమైన సిమెంట్ త్వరితంగా,
సులభంగా విక్రయించడం డీలర్‌కి ఎంతో
లాభదాయకం కదా !
కొనుగోలుదారు కోరుకునేది
అందించడమే అతని
వ్యాపారాభివృద్ధి రహస్యం.

సువర్ణ సిమెంట్ -
అత్యున్నతమైన సిమెంట్

Sobhagya

సువర్ణ సిమెంట్స్ లిమిటెడ్
6-3-682, పంజాగుట్ట, హైదరాబాద్ - 500 482.
ఫోన్లు : 210405, 210326, 210149

బ్రాంచీలు : విజయవాడ : ఫోన్ : 470235 విశాఖపట్నం - ఫోన్ : 61738,
బెంగళూరు : 16, బుల్ టెంపుల్ వీధి, బసవన గుడి, ఫోన్ : 627385.
మద్రాసు : 154, నార్త్ ఉస్మాన్ రోడ్; టి. నగర్, ఫోన్ : 446157.